సాక్షి వైఎస్సార్ జిల్లా

సోమవారం । 18 । మార్చి । 2024



వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. ఆదివారం వివిధ నియోజకవర్గాల్లో ఆయా నేతల సమక్షంలో పలువురు పార్టీలో చేరారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ (సా॥)	సహర్ మంగళ (ఉ॥)
కడప	: 6.30	5.05
పులివెందుల	: 6.33	5.00
ప్రొద్దుటూరు	: 6.32	5.09

గరిష్టం/కనిష్టం 38.0/26.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం 26.8 – 38.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.85 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గ్రూప్- 1 పరీక్షలు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో గ్రూప్–1 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్–1 ఉద్యోగాల నియామకం కోసం ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించిన స్క్రీనింగ్ టెస్టుకు సంబంధించి జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 9,754 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా ఉదయం సెషన్ లో 6,003 మంది అభ్యర్థులతో హాజరు శాతం 61.54 శాతంగా నమోదైంది. అలాగే మధ్యాహ్నం సెషన్ లో 9,754 మందికి 5,972 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారని, దీంతో అభ్యర్థుల హాజరు శాతం 61.23 శాతంగా నమోదైందన్నారు.

నూతన నియామకం



యేసోబు

జమ్మలమడుగు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన యేసోబును నియమిస్తూ పార్టీ కేంద్ర కమిటీ ఉత్తర్వులను జారీ చేసింది. ఆదివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు. కార్యదర్శి పదవి రావడం కోసం కృషి చేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో సోమవారం (నేటి) నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలను నిర్వహించాలన్నారు. పదో తరగతి పరీక్ష కేంద్రాలు కలిగిన పాఠశాలలను మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలన్నారు. ఉదయ, సాయంత్రం రెండు పూటలా పరీక్ష కేంద్రాలను ఉన్న పాఠశాలలకు సెలవుగా ప్రకటించాలని తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం నేటి నుంచి కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరుగుతుందని ఇంటర్మీడియట్ ఆర్‌ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. స్పాట్ వాల్యుయేషన్ విధులకు సంబంధించిన అపాయింటిమెంట్ ఆర్డర్స్ ఆయా జూనియర్ కళాశాలల జ్ఞానభూమి లాగిన్‌లో ఉంచినట్లు చెప్పారు. కళాశాలల ప్రిన్సిపాల్స్ వాటిని డౌన్‌లోడ్ చేసుకుని విధులకు కేటాయించిన తమ అధ్యాపకులను రిలీవ్ చేయాలని, మూల్యాంకన విధులకు ఉదయం 10 గంటలకు హాజరయ్యేలా చూడాలని అన్నారు. స్పాట్ వాల్యుయేషన్ అపాయింమెంట్ ఆర్డర్స్ పొంది విధులకు హాజరుకాని వారిపై, రిలీవ్ చేయని కళాశాలల యాజమాన్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐవో హెచ్చరించారు.

గేట్ ఫలితాల్లో విద్యార్థి ప్రతిభ



వి.సతీష్‌కుమార్‌రెడ్డి

కొండాపురం: గేట్ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఇందులో కొండాపురం మండలం బి. కొట్టాలపల్లె గ్రామానికి చెందిన వి. సతీష్‌కుమార్‌రెడ్డి ఆలిండియా లెవెల్‌లో 451 ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థి మాట్లాడుతూ ఆలిండియా లెవల్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో ఫిబ్రవరి 11న గేట్ పరీక్ష రాసినట్లు చెప్పారు.ఏలూరులోని సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసినట్లు తెలిపారు.ర్యాంకు సాధించిన విద్యార్థి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

'పది' విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

కడప కోటిరెడ్డిసర్కిల్: సోమవారం ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం కూడా కల్పించింది. టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులు హాల్ టిక్కెట్ చూపించి బస్సులో సురక్షితంగా పరీక్షా కేంద్రానికి చేరుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాలను పాటిస్తూ ఆర్టీసీ అధికారులు అనేక చర్యలు చేపట్టారు. జిల్లాలోని కడపలో డిపోలో 49 బస్సులు, బద్వేలు 35, ప్రొద్దుటూరు 81, జమ్మలమడుగు 28, మైదుకూరు 37, పులివెందుల డిపో 49 బస్సులు కలిపి మొత్తం 279 బస్సుల్లో విద్యార్థులకు ప్రయాణించే అవకాశం కల్పించారు. వివిధ పల్లె ప్రాంతాల నుంచి విద్యార్థులు చేరాల్సిన సెంటర్లకు పల్లె వెలుగు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఉచితంగా వెళ్లేందుకు బస్సులో హాల్ టిక్కెట్ చూపిస్తే ప్రయాణించే అవకాశం ఉందని అధికారులు తెలియజేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థీ.. విజయోస్తు



- నేటి నుంచి పది పరీక్షలు ప్రారంభం
- 153 పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు





మాధవరంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న పది పరీక్షల జిల్లా పరిశీలకులు వెంకట క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా నేటి నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.ఇందుకోసం విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు,విద్యుత్తు సౌకర్యం కల్పించారు. విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి 8.45 గంటలకే అనుమతి స్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులో వచ్చేవారు హాల్‌టికెట్‌ను చూపించి ఉచితంగా వచ్చేలా ఏర్పాటు చేశారు. ఈనెల 18వ తేదీ నుంచి 30 వరకు కడప డీఈఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 9573133385 నంబర్‌కు కాల్ చేసి సమస్యలుంటే విద్యార్థులు, సిబ్బంది తెలిపేందుకు వీలుగా 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. జిల్లాలో 153 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 27,858 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. వీరిలో 14,269 మంది బాలురు, 13,589 మంది బాలికలు ఉన్నారు. వీరి కోసం 153 మంది చీఫ్ సూపరింటెండెట్లు, 153 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లను నియమించారు.


- పరీక్షల పర్యవేక్షణకు రెవెన్యూ, పోలీసు, విద్యాశాఖ సిబ్బందితో కలిసి 07 టీమ్స్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ప్రత్యేకంగా ప్రతి పరీక్షా కేంద్రంలో కూడా సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.45 వరకు జరుగుతాయి. ఈ ఏడాది అన్ని పరీక్ష కేంద్రాలను 'నో ఫోన్ జోన్'గా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు డిపార్టుమెంట్ ఆఫీసర్, సిబ్బంది ఎవరి వద్ద కూడా సెల్‌ఫోన్‌ను ఉండకూడదని ఉన్నతాధికారులు అదేశించారు. పరీక్ష విధులకు హాజరయ్యే సిబ్బంది ఐడీ కార్డును ధరించాలని తెలిపారు. ప్రైవేటు వ్యక్తులు పరీక్ష కేంద్రాల్లో ఉండకూడదని సూచించారు. విద్యార్థుల వద్ద ఎలాంటి ఎలక్ట్రానిక్స్ వస్తువులు ఉండకూడదని ఆదేశించారు.

సమస్యాత్మక కేంద్రాలు గుర్తింపు....

జిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఇందులో ఖాజీపేట బాలికల జిల్లా పరిషత్తు హైస్కూల్, కాశినాయన మండలంలో ఏపీమోడల్ స్కూల్, నందిమండలం జిల్లా పరిషత్తు హైస్కూల్, చక్రాయంపేట కేజీబీవీ, కలసపాడు జిల్లా పరిషత్తు హైస్కూల్, కొండాపురం ఏపీఎస్ డబ్ల్యూఆర్ఎస్ ఉన్నాయి. వీటన్నింటిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.

జిల్లాలో పాఠశాలల సంఖ్య:	581
పరీక్షలు రాసే విద్యార్థులు :	27,858
చీఫ్ సూపరింటెండెంట్లు :	153
డిపార్టుమెంట్ ఆఫీసర్లు:	153
ఇన్విజిలేటర్లు:	1320
ఓపెన్ పది పరీక్ష కేంద్రాలు:	13
ఓపెన్ ఇంటర్ పరీక్షా కేంద్రాలు:	28
పది, ఇంటర్ పరీక్షలు రాయనున్నవారు :	9828

ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు కూడా...



ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం నుంచి ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలను కూడా నిర్వహించనున్నారు. ఓపెన్ పది పరీక్షలకు 13 కేంద్రాలను, ఇంటర్ పరీక్షల కోసం 28 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. పది, ఇంటర్‌కు సంబంధించి 9829 మంది విద్యార్థులు పరీక్షలను రాస్తున్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్ష జరుగుతుంది.

ప్రశాంతంగా వెళ్లాలి..



విద్యార్థులు నిర్ణీత సమయాని కంటే ముందుగా పరీక్ష కేంద్రాలకు వెళ్లాలి. టెన్షన్ పడితే పరీక్షను సరిగా రాయలేరు. మనసులో ఎలాంటి ఆందోళన లేకుంటే పరీక్ష బాగా రాయవచ్చు. పరీక్షకు వచ్చే ముందు ఏదో ఒకటి తిని రావాలి. – ఓ. వెంకటేశ్వరెడ్డి, సైకాలజిస్టు

ఏర్పాట్లు పూర్తి



పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. అన్ని పరీక్ష కేంద్రాల్లో డెస్కులను ఏర్పాటు చేశాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. – మర్రెడ్డి అనురాధ , డీఈఓ, కడప

సెల్‌ఫోన్ తెచ్చుకోవద్దు



విద్యార్థులు పరీక్షలను ప్రశాంతంగా రాసే విధంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయించాం. విద్యార్థులను 8.45 గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్స్ వస్తువులు, సెల్‌ఫోన్ వెంట తెచ్చుకోవద్దు. – ఎద్దుల రాఘవరెడ్డి, ఆర్‌జేడీ, పాఠశాల విద్య

ఆరోపణలకు తావివ్వొద్దు



ఆరోపణలకు తావు లేకుండా పరీక్షలు నిర్వహించా లి. ఏ కేంద్రంలోనైనా ఆరోపణలు వచ్చినా యాక్ట్ 25, 1997 ప్రకారం చర్యలు ఉంటాయి. సిబ్బంది అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. – ఎం.వెంకట క్రిష్టారెడ్డి, పది పరీక్షల పరిశీలకులు

పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్, చిత్రంలో వెంకట క్రిష్టారెడ్డి, అనురాధ

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభంకానున్న పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు.ఆదివారం కడప జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పది పరీక్షల జిల్లా అబ్జర్వర్ మార్తాల వెంకట క్రిష్టారెడ్డి, డీఈఓ మర్రెడ్డి అనురాధలతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ సారి అన్ని పరీక్షా కేంద్రాలను నో ఫోన్ జోన్‌గా ప్రకటిచారన్నారు. ఎక్కడైనా మాస్‌కాపీయింగ్‌కు పాల్పడినట్లు తెలిస్తే యాక్ట్ 25 ప్రకారం చర్యలుంటాయని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో కూడా విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించినటు చెప్పారు. దూరప్రాంత విద్యార్థులకు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పది పరీక్షల ప్రశ్నాపత్రంపై క్యూ ఆర్ కోడ్ ఇవ్వడం జరిగిందని ఎక్కడైనా ఎదైనా పొరపాటు జరిగితే తక్షనం తెలిసిపోతుందన్నారు. అప్పుడు సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. పది పరీక్షలతోపాటు ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలను కూడా 18వ తేదీ మధ్యాహ్నం నుంచి నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమీషనర్ వెంకటేష్, సూపరెండెంటెంట్ బాదుల్లాలు పాల్గొన్నారు.

'స్పందన' తాత్కాలిక రద్దు

కడప సెవెన్‌రోడ్స్: సాధారణ ఎన్నికలు –2024 సందర్భంగా ఈ నెల 18వ తేదీ (సోమవారం) నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు 'స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ రామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గుడి వద్దకు రమ్మన్నారు.. టీడీపీ కండువా వేశారు

మేమంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నాము: వెంగన్నపల్లె గ్రామస్థులు



ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వెంగన్నగారిపల్లె గ్రామస్థులు

చాపాడు: ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం చుట్టు ప్రక్కల గ్రామాల్లో తెలిసిన టీడీపీ నాయకులు రామాలయం వద్దకు రమ్మన్నారని, విషయం తెలపకుండా టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ చేత టీడీపీ కండువాలు వేయించారని.. వాస్తవానికి తామంతా వైఎస్సార్‌సీపీ వర్గీయులమని మండలంలోని వెంగన్నగారిపల్లె గ్రామస్తులు తెలిపారు. అన్నవరం పంచాయతీ పరిధిలోని వెంగన్నగారిపల్లె గ్రామానికి చెందిన డి.రామసుబ్బారెడ్డి, జి.ఎల్లారెడ్డి, ఏ.రామసుబ్బారెడ్డి, కొండారెడ్డి, జి.నడిపి ఎల్లారెడ్డి, డి.వెంకటసుబ్బారెడ్డి, డి.రామచంద్రారెడ్డి, రామాంజనేయరెడ్డి, శివారెడ్డి, మారుతిరెడ్డి, జి.రామాంజనేయరెడ్డి, ఏ.కుళ్లాయిరెడ్డిలతో పాటు 30 కుటుంబాలకు చెందిన వారు గ్రామ ఉప సర్పంచ్ పవన్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కండువా ధరించి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. తాము వైఎస్సార్‌సీపీ వర్గీయులమేనని తాము టీడీపీలోకి వెళ్లలేదన్నారు. గ్రామంలో 33 కుటుంబాలు ఉంటే 8 మందికి కండువాలు వేసి 40 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు పత్రికల్లో వేయించారన్నారు. తామంతా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వెంటే ఉంటామని తెలిపారు. అనంతరం గ్రామంలో పలు రకాలైన అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్థులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, చాపాడు, దువ్వూరు ఎంపీపీలు లక్షుమయ్య, జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామోహన్‌రెడ్డి, నాయకులు ప్రసాద్‌రెడ్డి, మడూరు వినయ్‌కుమార్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, పట్టాభిరామిరెడ్డి, మాచనపల్లె సుదర్శన్‌రెడ్డి, జయరామిరెడ్డి, నీలానందారెడ్డి, వెంకట్‌రెడ్డి, జమసుబ్బారెడ్డి, సర్పంచ్‌లు కిషోర్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- నియమావళి పాటించాలి
- రాజకీయ పార్టీలతో కలెక్టర్ విజయరామరాజు




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: 2024 ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారితోపాటు జేసీ గణేష్ కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్, అసిస్టెంట్ కలెక్టర్లు మౌర్య భరద్వాజ్, ప్రత్యూషలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలు అత్యంత ప్రాధాన్యతతో కూడినవని, ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర ఎంత ఉందో . రాజకీయ పార్టీల నుంచి కూడా అంతే సహకారం అవసరం ఉందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిందని, పార్టీలకు సంబంధించిన గుర్తులు, రాజకీయ పార్టీల నేపథ్యం ఉన్న పర్సన్స్‌కు సంబంధించిన ఫొటోలను అన్ని కార్యాలయాలు, ప్రైవేటు, పబ్లిక్ ప్రదేశాల్లో ఎన్నికల నిబంధనల మేరకు తొలగించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌గా గుర్తింపబడిన ప్రతి కేంద్రంలో రెండు వెబ్ కామ్స్, మైక్రో అబ్జర్వర్ ను నియమించినట్లు చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల సిబ్బంది తమ విధులను నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. ఆ మేరకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు, ఎన్నికల విధుల నిర్వహణకు సిబ్బందిని సంసిద్ధం చేశామన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలు మార్పులు చేర్పులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలన నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామన్నారు. కాగా తుది జాబితా పరంగా జిల్లాలో మొత్తం 1941 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. అభ్యంతరాలు, అభ్యర్థనలను స్వీకరించి సవరణలు పూర్తి చేయగా ప్రస్తుతం జిల్లాలో పోలింగ్ స్టేషన్ల సంఖ్య 1963కు చేరిందన్నాను. ఈ వివరాలన్నింటినీ ఎన్నికల కమిషన్‌కు అందజేయనున్నట్లు చెప్పారు. నేటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అన్ని రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించరాదని, సభలు, సమావేశాలు, వాహనాలు అన్ని ముందస్తు అనుమతి పొందాలని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గాలకు చెందిన ఆర్వోలు, డీఐఓ విజయ్ కుమార్, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

మామిడి.. తగ్గిన దిగుబడి

అన్నమయ్య జిల్లాలో మామిడి సాగు చేసిన రైతుల ఆశలు అడియాసలవుతున్నాయి. పూత సరిగా రాకపోవడంతో దిగుబడి 25 శాతం కూడా మించలేదు. ఒక వైపు కరుణించని ప్రకృతి.. మరోవైపు తగ్గిన దిగుబడి.. ఇంకోవైపు లభించని గిట్టుబాటు.. ఇన్ని సమస్యల మధ్య అన్నదాత కొట్టుమిట్టాడుతున్నాడు.

- ప్రకృతితోపాటు దెబ్బతీసిన తెగుళ్లు
- సరిగా రాని పూత
- కాపు 25 శాతం మించని వైనం
- లబోదిబోమంటున్న రైతులు



మామిడి చెట్లకు కాయలు కనిపించని దృశ్యం



రాయచోటి: ప్రకృతి పగబట్టడమే కాదు.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని మార్కెట్‌లో అనుకున్న మేర మామిడి రైతుకు మద్దతు లభించడం లేదు. రెండేళ్లుగా ప్రకృతి సహకరించకపోవడంతో అన్నమయ్య జిల్లా పరిధిలోని మామిడి రైతులకు కష్టకాలం వెంటాడుతోంది. చెట్లు పచ్చదనంతో నిండుగా ఉన్నా వాటిలో పూత లేదు.. వచ్చిన పూత రాలిపోవడంతో కాత నిలవలేదు. ఫలితంగా వందల కోట్ల రూపాయల ఆదాయం మామిడి రైతులకు దక్కకుండానే పోతోంది. అన్నమయ్య జిల్లాలో 32వేల హెక్టార్లలో, వైఎస్సార్ జిల్లాలో 15 వేల హెక్టార్లలో మామిడి సాగులో ఉంది. గతేడాది ఆశించిన స్థాయిలో దిగుబడులు లేకపోవడంతో.. ఈ ఏడైనా సరైన దిగుబడులు వచ్చి నమ్ముకున్న రైతులకు తోడుగా నిలుస్తుందని భావించారు. అయితే వారి ఆశలు నెరవేరలేదు. ప్రకృతి కరుణించక, తెగుళ్ల బారిన పడి సస్యరక్షణ సరిగా లేక.. చలి, మంచు ప్రభావం రైతన్నను తీవ్రంగా దెబ్బతీసింది. భారీగా ఉన్న అంచనాల నుంచి ఏదో కొంత మేర దిగుబడి వస్తే చాలనే పరిస్థితి కనిపిస్తోంది. పెద్ద చెట్ల నుంచి ఎకరాకు ఐదు టన్నులకు పైగా దిగుబడి వచ్చే పరిస్థితి నుంచి టన్ను లోపే దిగుబడి పడిపోయింది. ఒకసారి కాదు కదా రెండు మూడు సార్లు పూత వచ్చినా ప్రయోజనం మాత్రం కనిపించలేదు. మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందంగా.. ముందే దిగుబడి లేక సస్యరక్షణకు పెట్టిన పెట్టుబడులు రాక అల్లాడుతున్న మామిడి రైతులను మార్కెట్‌లో వినిపిస్తున్న ధరల పోటు కలవరపాటుకు గురి చేస్తోంది.

వెంటాడుతున్న తెగుళ్లు

చెట్లు ఆరోగ్యంగా కనిపిస్తున్నా బుడిద, బంక తెగుళ్లు వెంటాడుతున్నాయి. ఈ ఏడాది పూత కొంత వరకు ఉన్నా తెగుళ్ల వల్ల పంటనష్టం అపారంగా ఉండటంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. చిన్న పిందెలు పట్టినా తెగుళ్ల కారణంగా రాలిపోతున్నాయి. సాధారణంగా దిగుబడి లేకపోతే మార్కెట్‌లో వాటికి అధికమైన డిమాండ్, ధరలు ఉండాలి. కానీ నేటికి మామిడికి అనుకున్నంత రీతిలో మార్కెట్‌లో ధరలు లేకపోవడం బాధాకరం. దీంతో లక్షలాది రూపాయల నష్టాన్ని, చేసిన అప్పులకు వడ్డీల భారాన్ని కలిగిస్తున్నాయి.


పెరిగిన పెట్టుబడి

వాతావరణంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా డిసెంబరు నెలలో సమయానికి పూత రాలేదు. నెల రోజులు ఆలస్యంగా పూత రావడంతో పురుగు ప్రభావం అధికమైంది. వచ్చిన కొద్దిపాటి పూత కూడా.. జనవరి, ఫిబ్రవరిలో మంచుదెబ్బకు రాలిపోయింది. తేనె మంచు పురుగు కారణంగా పూత నల్లగా మారిపోతోంది. పిందెలు రాలిపోతున్నాయి. తామరపురుగు ప్రభావంతో మరింత నష్టపోతున్నారు. నివారణకు రైతులు వారానికి ఎకరాకు రూ.6 వేల చొప్పున ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎకరాకు దిగుబడి 2 టన్నులు వస్తుందో లేదో అని కొందరు రైతులు వాపోతున్నారు. చాలా ప్రాంతాల్లో టన్నుకు లోపే దిగుబడి ఉందన్న ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.50 నుంచి రూ.75 వేల చొప్పున ముందే చెల్లించి కౌలుకు తీసుకున్నామని అందులో సగమైనా వస్తుందో లేదో అనే ఆవేదన వారిలో కనిపిస్తోంది. కాపు 25 శాతం మించి వచ్చే సూచనలు కనిపించడం లేదని వారు వాపోతున్నారు.

గణనీయంగా పడిపోయిన వైనం

రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా పండ్ల తోటల సాగులో ప్రాధాన్య స్థానంలో ఉంది. మామిడి తోటల సాగులో కూడా గణనీయమైన ప్రగతిని సాధించింది. మామిడిలో ప్రధానంగా లాల్ బహర్, బేనీషా, ఖాదర్, తోతాపురి, బెంగుళూర, ఇమామ్ పసంద్, చెరుకు రసం, సువర్ణరేఖ, మల్లిక, మలుగుబా, దసేరి, నీలం తదితర రకాలను సాగు చేశారు. జిల్లాలో 32 వేల హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉండగా, అందులో 30 వేల హెక్టార్లలో కాయలు కాసే చెట్లు ఉన్నాయి. అయితే ప్రకతి వైపరీత్యమో, తెగుళ్ల భారమో, చలి మంచు ప్రభావమో తెలియదు గానీ దిగుబడులు మాత్రం గణనీయంగా తగ్గిపోయాయి.

ప్రకృతి అనుకూలించలేదు



మామిడి పంటకు ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు. చలి, మంచు, తెగుళ్ల కారణంగా పూత ఆలస్యంగా వచ్చింది. అది రాలిపోవడంతో ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం సాగులో ఉన్న మామిడిలో సరాసరిన ఎకరాకు టన్నుకు మించి దిగుబడి రాదని భావిస్తున్నాం. రైతులు ఎంత సస్యరక్షణ చర్యలు చేపట్టినా ప్రకృతి అనుకూలించలేదు. ఫలితంగా 25 శాతంకు మించి దిగుబడి లేదని చెప్పవచ్చు. వచ్చిన దిగుబడికి మార్కెట్ ఎంత వరకు సహకరిస్తుందన్నది మునుముందు తెలుస్తుంది. – రవిచంద్రబాబు, జిల్లా ఉద్యానశాఖ అధికారి, అన్నమయ్య జిల్లా

క్లుప్తంగా

తేనెటీగల దాడిలో ఇద్దరికి గాయాలు


గాయపడిన రామసుబ్బమ్మ

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని చింతపుత్తాయపల్లె గ్రామంలో ఆదివారం ఇద్దరిపై తేనెటీగలు దాడి చేశాయి. గ్రామానికి చెందిన బీరం రామసుబ్బమ్మ, బీరం రాములమ్మలు పొలం పనుల్లో ఉండగా ఒక్కసారిగా పెద్ద తేనెటీగలు దాడి చేయడంతో ఇరువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే స్థానికులు గుర్తించి వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతుడు రామదాసు

కాశినాయన : మండలంలోని నరసాపురం గ్రామంలో ఉమ్మడిశెట్టి రామదాసు (65) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు రామాపురం మండలం సుద్దమల గ్రామానికి చెందిన వ్యక్తి అని, గత రెండు సంవత్సరాల క్రితం ఇంటి నుండి వచ్చి జ్యోతిలో అక్కడక్కడ తిరుగుతుండేవాడని తెలిపారు. ఇతడు అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడన్నారు. ఈ నేపథ్యంలో నరసాపురం ప్రభుత్వాసుపత్రిలో చూపించుకుని గ్రామంలోని అంకాలమ్మ అరుగు దగ్గర ఆయాసం ఎక్కువై కత్తితో పొడుచుకుని చనిపోయాడని తెలిపారు. ఈ విషయాన్ని బంధువులకు తెలిపామన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం వారి బంధువులకు అప్పగించారు.

మహిళ అదృశ్యం


భైరవ కొండమ్మ(ఫైల్)

చాపాడు: మండలంలోని కుచ్చుపాప గ్రామానికి చెందిన బడుగు భైరవ కొండమ్మ(50) అనే మహిళ గత ఆరు రోజులుగా కనిపించడం లేదని ఎస్ఐ ఆర్‌పీ కొండారెడ్డి తెలిపారు. మహిళ మానసిక పరిస్థితి సరిగా లేక ఈ నెల 12వ తేదీ ఆసుపత్రికి వెళుతున్నానని ఇంటి వద్ద చెప్పి వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు బంధువుల గ్రామాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవటంతో మహిళ కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గర్భిణి మృతి

మదనపల్లె సిటీ : మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో ఓ గర్భిణి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. రామసముద్రం మండలం అవిసేపల్లికి చెందిన దేవరాజు భార్య మహిత (22) రెండో కాన్పు నిమిత్తం పుట్టినిల్లు నిమ్మనపల్లె మండలం తవళం పంచాయతీ కుమ్మరపల్లికి వెళ్లింది. ఇంటి వద్ద నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. మూర్ఛతో అస్వస్థతకు గురై చనిపోయినట్లు వైద్యులు తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన 100 కుటుంబాలు

బద్వేలు అర్బన్ : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలోకి వలసలు మొదలయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో గల గట్టుపల్లె పునరావాస కాలనీలో వార్డు ఇన్‌చార్జి సుబ్బరాజు ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన వరపల్లె రమణయ్య, వరపల్లె హరిక్రిష్ణ, వరపల్లె తిరుపతయ్యతో పాటు 100 కుటుంబాల వారు ఆదివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. పునరావాస కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన కుటుంబాలకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలు పెద్ద ఎత్తున ఆకర్షితులవుతున్నారని అన్నారు. కులం, మతం, పార్టీ చూడకుండా అన్ని వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషితో ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో 2024 ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గెలిస్తేనే పేదలకు మరింత మేలు జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలను కేవలం ఓటుబ్యాంకుగా మాత్రమే చూశారని, జగనన్న మాత్రం సామాజిక సాధికారత పేరుతో ఆయా వర్గాలకు రాజకీయంగా, ఆర్థికంగా మేలు చేస్తున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారంతా సైనికుల్లా పనిచేసి మరోసారి బద్వేలులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, కేశవరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు రమణారెడ్డి, నరసయ్య, పెంచలయ్య, విజయరావు తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీలో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ


పార్టీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు

తెలుగుదేశం నుంచి వైఎస్సార్‌సీపీలో 30 కుటుంబాలు చేరిక

చక్రాయపేట : మండలంలోని చక్రాయపేట పంచాయతీ పరిధిలోగల యార్లవాండ్లపల్లెకు చెందిన సుమారు 30 కుటుంబాలవారు ఆదివారం తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరారు. యార్లవాండ్లపల్లెకు చెందిన పెద్దింటి చెన్నప్ప కూతల ఈశ్వరయ్య, తంగేడుపల్లె నాగయ్య, సుబ్బరాయుడు, రంగనాయకులు, కేశవ, రామాంజి, సుబ్బయ్య, ఉత్తయ్య, మల్లికార్జున, సత్తార్, పెద్ద చెన్నప్ప, నడిపి చెన్నప్ప, చిన్న చెన్నప్ప, చెన్నకేశవులు, గంగాధర్, చిన్న చెన్నయ్య, పుల్లాసి ఆంజనేయులు, కోనయ్య, యర్ర చెన్నప్ప, సుబ్బయ్య, పెద్ద సుబ్బయ్య, చిన్నచెన్నయ్య, కొండయ్య, బాలయ్య, నాగమునెమ్మ, వీరమ్మ, భాగ్యలత, కొండమ్మ, సుబ్బరాయుడు, రమాదేవి, అంజనమ్మ, నాగమ్మ, రామక్క, గంగులమ్మ, రమణమ్మ, భాగ్యమ్మతో పాటు మరిన్ని కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి వైఎస్ కొండారెడ్డి, ఎంపీ అవినాష్ రెడ్డిలు రోడ్డు వేయించారని చెప్పారు. దీనికి తోడు జగనన్న పథకాలతో లబ్ధి పొందామని అందుకే తాము తెలుగుదేశం పార్టీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివ ప్రసాదరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, సచివాలయ కన్వీనర్ చంద్ర, పార్టీ నేతలు గంగిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, దేవభాస్కర్, బాబు, ఏసోబు, అక్బర్‌వలీ, మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

వీరపునాయునిపల్లె: మండలంలోని గోనుమాకులపల్లెలో ఆదివారం తెలుగుదేశం పార్టీకి చెందిన హనుమంతు, ఆంజనేయులు, పెద్ద హనుమంతు, బ్రహ్మయ్య, చిన్న హనుమంతు, చంద్రమోహన్, రుషి, గురుప్రసాద్, సుబ్బరాయుడు, ప్రసాద్‌తో పాటు మరో 10 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి పాలనకు ఆకర్షితులమై పార్టీలో చేరామని వారు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయానికి సమష్టిగా పనిచేయాలని వారికి ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేంద్రకుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ గోవిందురెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల పరిశీలకుడు రాజుపాలెం జగన్‌రెడ్డి, పుల్లారెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 75 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీ నుంచి సుమారు 75 కుటుంబాల వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం రాత్రి స్థానిక 38వ డివిజన్‌లో జీఎం మున్నా, సుబ్బారెడ్డి, మున్నా, తాజుద్దీన్, ఖాదర్ అబ్దుల్లా, జుబేర్, ఖాదర్‌బాషా తదితరులకు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరుకు ఆకర్షితులమై ఈ పార్టీలో చేరుతున్నామన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు కోసం నిష్పక్షపాతంగా పనిచేస్తామని, పార్టీ ఆశయాలకు అనుగుణంగా అధిష్టానం ఆదేశాలు, మార్గదర్శకాలను అనుసరించి చివరిదాకా పార్టీ పటిష్టత కోసం పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌బి అహ్మద్‌బాషా, పార్టీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, ఎస్. సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నజీర్, ఇబ్రహీం మియ్యా, బంగారు నాగయ్య, అజ్మతుల్లా, షఫీ, జఫ్రుల్లా, కమాల్ బాషా, సూర్యనారాయణ రావు పాల్గొన్నారు.

మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మొహిద్దీన్ వైఎస్సార్‌సీపీలో చేరిక

కడప కార్పొరేషన్ : మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మొహీద్దీన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం స్థానిక కాగితాలపెంటలోని కింగ్ ఫంక్షన్ హాలులో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా ఎమ్మెల్సీ ఎం.రామచంద్రారెడ్డిల సమక్షంలో ఆయన కాంగ్రెస్ నాయకులు కలీముద్దీన్, జుల్ఫికర్, జిలానీ, అబ్దుల్లా, షబ్బీర్ హుస్సేన్, ఖలీల్ బాషా, చాన్ బాషాలతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారిని డిప్యూటీ సీఎం, మేయర్ పేరు పేరునా పలకరించి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా జనరంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సెక్యులర్ అన్న పదానికి నిజమైన నిదర్శనం వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్ బాషా, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ కరిముల్లా, పార్టీ నాయకులు పి.జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య యాదవ్, తోటక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, షఫీ, చల్లా రాజశేఖర్, రెడ్డి ప్రసాద్, రఫీ, మున్నా తదితరులు పాల్గొన్నారు.


వైఎస్ కొండారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన యార్లవాండ్లపల్లె వాసులు


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


పార్టీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

జయాదిత్య న్యూరో కేర్‌లో అత్యాధునిక వైద్య సేవలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని జయాదిత్య న్యూరో కేర్‌లో అన్ని రకాల న్యూరాలజీ సంబంధించిన ఆరోగ్య సమస్యలకు అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నట్లు ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ గణేష్ వల్లంపల్లి తెలిపారు. ఆదివారం నగరంలోని ద్వారకా నగర్‌లో ఉన్న జయాదిత్య న్యూరో కేర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యాధునిక వసతి సౌకర్యాలు కలిగిన సొంత భవనంలో జయాదిత్య న్యూరో కేర్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత ఆరు సంవత్సరాలుగా తమను ఆదరిస్తున్న రాయలసీమ ప్రాంత ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పక్షవాతం, మూర్ఛ వ్యాధి, తల నొప్పి, మూతి వంకర పోవడం, మెడ, నడుం నొప్పులు, వెన్నుపూస సమస్యలు, తిమ్మిర్లు, అరికాళ్ల మంటలు తదితరాలకు నాణ్యమైన చికిత్స అందిస్తున్నామన్నారు. వణుకు, పార్కిన్ సోనిజం, తల తిరుగుట ,తూలుట లాంటి వ్యాధులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే నరాల బలహీనత, నీరసం, మానసిక సమస్యలు, నిద్ర సమస్యలు, చిన్న పిల్లల్లో ఎదుగుదల లోపం, కాళ్లు లాగడం, గుంజడం లాంటి సమస్యలు ఉన్నవారు తమను సంప్రదించాలన్నారు. పక్షవాతం వచ్చిన 4 గంటల లోపు మెదడు రక్తనాళంలోని రక్తం గడ్డ కరిగించేందుకు ఐవీ త్రీంబోలైసిస్ ఇంజెక్షన్ అందుబాటులో ఉందన్నారు. ఇతర వివరాలకు జయాదిత్య న్యూరో కేర్,సెల్ 7995325152 అనే నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.


విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ గణేష్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మల్లికార్జున

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కలికిరి మండలం మర్రికుంటపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు మల్లికార్జున స్థానిక నిమ్మనపల్లె రోడ్డులో ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. సొంతపనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో పుంగనూరు నుంచి ఇంటికి వస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో మల్లికార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలిసిన వెంటనే మృతుని భార్య ఉదయశ్రీ, బంధువులు ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు.

బాకీ డబ్బు విషయమై ఘర్షణ

ఇరువర్గాలపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : బాకీ డబ్బు విషయమై జరిగిన ఘర్షణలో వన్‌టౌన్ పోలీసులు ఇరు వర్గాలపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు రామేశ్వరంలోని సీఎస్ఐ చర్చి వద్ద నివాసం ఉంటున్న సృజన్ కుమార్ అలియస్ చందు ఆదివారం చర్చికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో అదే వీధిలో ఉంటున్న బుజ్జమ్మ, బెనర్జీ, చెన్నయ్యలు అతన్ని తోసుకుంటూ ఇంట్లోకి తీసుకెళ్లి, దాడి చేసి బెదిరించినట్లు సృజన్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుజ్జమ్మ దగ్గర కొంత డబ్బు అప్పుగా తీసుకున్నానని వడ్డీ కట్టని కారణంగా వారు దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వడ్డీ లేదా అసలు కావాలని అడిగినందుకు దాడి

రామేశ్వరంలో నివాసం ఉంటున్న బుజ్జమ్మ సమీప బంధువులైన మోషె, అతని తమ్ముడు శేఖర్‌కు 10 ఏళ్ల క్రితం రూ. 10 లక్షలు అప్పుగా ఇచ్చింది. కొన్ని నెలల నుంచి వడ్డీ సరిగా కట్టలేదు, ఈ క్రమంలో వడ్డీ లేదా అసలు అయినా కట్టమని బుజ్జమ్మ వారిని అడుగుతూ వస్తోంది. ఈ క్రమంలో ఆదివారం మోషె కుమారుడు చందు ఆమె ఇంటి వద్దకు వచ్చి డబ్బు ఇచ్చేది లేదని, ఏం చేసుకుంటారో చేసుకోండని దబాయించసాగాడు. బయట మాట్లాడటం ఎందుకు ఇంట్లోకి వచ్చి మాట్లాడు అని సర్ది చెబుతూ అతన్ని బుజ్జమ్మ కుటుంబ సభ్యులు ఇంట్లోకి తీసుకెళ్లారు. అంతలోనే మోషె, శేఖర్ తదితరులు వారి ఇంటి వద్దకు వచ్చి అంతు చూస్తామని బెదిరించి గొడవ చేశారని బుజ్జమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పరస్పర ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

వడ్డీ చెల్లించలేదని దాడి

తీసుకున్న అప్పునకు వడ్డీ చెల్లించలేదనే కారణంతో తనపై శ్రీనివాసులు అనే వ్యక్తి దాడి చేశాడని సురేష్‌కుమార్ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాజబాటవీధికి చెందిన తోటంశెట్టి సురేష్‌కుమార్ జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. అతను రెండేళ్ల క్రితం చల్లా శ్రీనివాసులు అనే వ్యక్తి వద్ద రూ. 21 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఈ క్రమంలో అతను ప్రతి నెలా వడ్డీతో పాటు కొంత అసలు కడుతూనే రూ. 15 లక్షలు వరకు అప్పు చెల్లించాడు. మిగిలిన మొత్తానికి నెల నెలా వడ్డీ చెల్లిస్తున్నాడు. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఒక నెల వడ్డీ డబ్బు కట్టలేదు. దీంతో సురేష్‌కుమార్ ఆదివారం దుకాణంలో ఉండగా శ్రీనివాసులు అక్కడికి వెళ్లి దుర్భాషలాడుతూ ఇనుప పాత్రతో దాడి చేశాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై హత్యాయత్నం

కడప అర్బన్ : కడప నగరంలోని అక్కాయపల్లి ఇక్బాల్‌రైస్ మిల్లు ఎదురుగా కడప-కర్నూలు జాతీయరహదారిపై ఆదివారం రాత్రి నరసింహులు (54) అనే వ్యక్తిపై అజీజ్ అనే యువకుడు కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. డీఎంహెచ్ఓ కార్యాలయం వీధిలో నివాసం ఉంటున్న నరసింహులు ఒకవైపు చాకలిపని చేసుకుంటూ, మరోవైపు ఖర్బూజకాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే వీధిలో నివాసం ఉంటున్న అజీజ్ అనే యువకుడు చెడువ్యసనాలకు బానిసగా మారాడు. ఇప్పటికే పలుమార్లు నేరాలకు పాల్పడి పోలీసుల రికార్డుల్లోకి ఎక్కాడు. ఈక్రమంలో ఆదివారం రాత్రి నరసింహులు తన ఇంటి దగ్గరి నుంచి రోడ్డుపైకి వచ్చి ఓ అరుగుమీద కూర్చున్నాడు. అంతలోపే అజీజ్ కోపంగా వచ్చి నరసింహులు తలపై, చేతిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. కడప తాలూకా సీఐ తిమ్మయ్య, పోలీసులు సంఘటన స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. రక్తపుమడుగులో ఉన్న నరసింహులును 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై కడప తాలూకా సీఐ తిమ్మయ్య మాట్లాడుతూ సంఘటనకు గల కారణాలు విచారిస్తున్నామన్నారు. కాగా నిందితుడు అజీజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.


తీవ్రగాయాలతో సంఘటన స్థలంలో పడివున్న నరసింహులు


నరసింహులును అంబులెన్స్‌లో తరలించేందుకు పోలీసుల ప్రయత్నాలు

కట్టుకున్న భార్యను కడతేర్చాడు


రమణమ్మ(ఫైల్)


మృతురాలి కుమార్తె సంధ్య


యోగానందరెడ్డి (ఫైల్)

లక్కిరెడ్డిపల్లి : భర్తే కాలయముడిగా మారి కట్టుకున్న భార్యను చున్నీతో గొంతు నులిమి హత్యచేసిన సంఘటన అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం కుర్నూతల గ్రామం బొమ్మేపల్లెలో చోటు చేసుకుంది. సీఐ జీవన్ గంగనాథ్ బాబు కథనం మేరకు..

రమణమ్మ (32)ను యోగానందరెడ్డి ఎనిమిదేళ్ల క్రితం వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలం, నల్లయ్యగారిపల్లెలో వివాహం చేసుకున్నాడు. వీరిద్దరూ తరచూ గొడవలు పడేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున పథకం ప్రకారం యోగానందరెడ్డి చున్నీతో రమణమ్మ గొంతు నులిమి హత్య చేశాడు. నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన భార్యను హత్యచేశానని చెప్పాడు.

దీంతో వెంటనే సీఐ జీవన్ గంగనాథ్ బాబు, ఎస్ఐ విష్ణువర్ధన్‌లు తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ టీమ్‌తో పరిశీలించారు. పోస్టుమార్టం కోసం రమణమ్మ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోలీసులు వేధిస్తున్నారంటూ ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యకు యత్నించిన పసుపులేటి కిషోర్ కుమార్

రాయచోటి టౌన్ : రాయచోటి అర్బన్ స్టేషన్‌లో విధులు నిర్వహించే ఎస్ఐ తనను వేధిస్తున్నాడంటూ రాయచోటి పట్టణానికి చెందిన పసుపులేటి కిషోర్ కుమార్ అనే వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన రాయచోటిలో జరిగింది. ఆదివారం రాయచోటి పోలీస్ స్టేషన్ ఆవరణంలోనే విష ద్రావణం తాగాడు. వెంటనే స్థానికులు గమనించి రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. రాయచోటి పట్టణానికి చెందిన పసుపులేటి కిషోర్ కుమార్ తన భార్య నుంచి విడాకులు కావాలని పెద్ద మనుషుల ద్వారా కోర్టును ఆశ్రయించాడు. అయితే పోలీసులు తన భార్యతో కాపురం చేయాలని వత్తిడి చేస్తుండటంతో వారి వత్తిడి భరించలేక ఇలా ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటనపై ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. ఈశ్వర్ స్పందిస్తూ దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి ఆత్మహత్యాయత్నానికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా పసుపులేటి కిషోర్ కుమార్‌పై అతని భార్య మిస్సింగ్ కేసు పెట్టిందని, విచారణలో భాగంగా అతనిని పిలిచి మాట్లాడామన్నారు. అలాగే కుటుంబ కలహాలు వీడాలని కౌన్సెలింగ్ ఇచ్చినందుకు ఇలా ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు తెలిపారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ, మిత్ర పక్షాలను ఓడించడమే లక్ష్యం

కడప వైఎస్సార్ సర్కిల్ : దేశ సమైక్యతను, సమగ్రతను దెబ్బతీస్తున్న ఫాసిస్టు బీజేపీతోపాటు దాని మిత్రపక్షాలను ఓడించేందుకు సమాయత్తం కావాలని సీపీఐ నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు, హరినాథ్ రెడ్డి మాట్లాడారు. ఎన్నికల వాగ్దానాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైన మోడీ సర్కార్ 10 సంవత్సరాల పాలనలో ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ, ప్రజా కంటక ప్రభుత్వంగా ముద్ర వేసుకుందన్నారు. ఆ ముద్ర నుంచి బయటపడేందుకు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. నల్లధనం వెలికితీత, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పన, పన్నుల భారం తగ్గింపు, నిత్యావసర వస్తువుల ధరలు అదుపు, విభజన హామీలు అమలు ఇలా అన్ని విషయాల్లో విఫలమయ్యారన్నారు. స్వాతంత్రానికి పూర్వం నుంచి పోరాడి సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం, కార్మిక చట్టాలను సమూలంగా మార్పు చేసి దోపిడీకి ద్వారాలు తెరిచారని ధ్వజమెత్తారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు నిరంతరం ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకపోగా నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారన్నారు. విద్యారంగాన్ని పూర్తిగా కాషాయమయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోలు, డీజిల్ ధరలకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయకపోగా ఎగువభద్రకు జాతీయ హోదా, కృష్ణా జలాల పంపిణీపై సమీక్ష వంటి వ్యతిరేక చర్యలకు మోదీ ప్రభుత్వం పాల్పడిందన్నారు. ప్రజలు, ప్రజా సమస్యలను పూర్తిగా పక్కకు నెట్టి కులం, మతం, దేవుడు, దేశభక్తి పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టడం దారుణమన్నారు. స్వతంత్ర దర్యాప్తు సంస్థలను పూర్తిగా బీజేపీ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందన్నారు. బీజేపీ విధానాలను ప్రశ్నించే రాజకీయ పక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా సీఏఏ తెచ్చి ముస్లిం మైనారిటీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా ముద్ర వేసేందుకు యత్నిస్తోందన్నారు. సాగు చట్టాలు రద్దుచేసి గిట్టుబాటు ధర కల్పించాలని అడిగిన రైతులను కాల్చి చంపిందన్నారు. దేశ సంపదను కొల్లగొట్టే అంబానీ, అదాని కంపెనీలకు ఊడిగం చేస్తూ, సంపద సృష్టిలో భాగస్వామ్యం అయ్యే శ్రామిక వర్గాన్ని మరింత దోపిడీ చేస్తోందన్నారు. దేశ సమైక్యత సమగ్రతకు తీవ్ర విఘాతం కలిగిస్తున్న బీజేపీ విధానాలను ప్రశ్నించాల్సిన పాలక, ప్రధాన ప్రతిపక్షాలు బీజేపీతో అంటకాగుతూ రాష్ట్ర ప్రజల అభివృద్ధి ఆకాంక్ష, ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నాయని వారు విమర్శించారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో బీజేపీ, దాని మిత్రపక్షాల ఓటమికి, ఇండియా కూటమి గెలుపునకు కృషి చేయాలని వారు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పలువురు సీపీఐ, మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓబులేసు